క్లుప్తంగా

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

జడ్చర్ల టౌన్: మండలంలోని లింగంపేట గ్రామంలో 863 సర్వేనంబర్‌లో ఉన్న ప్రభుత్వ మిగులు భూమిని ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని గ్రామస్తులు అధికారులకు విన్న వించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆక్రమించేందుకు యత్నించారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే ఆదివారం ప్రభుత్వ భూమిని దున్ని విత్తనాలు వేసేందుకు యత్నించారని, అడగటానికి వెళ్లిన వారిపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మిగులుభూమిని గుర్తించి దానికి హద్దులు నిర్ణయించి గ్రామపంచాయతీకి అప్పగించాలని కోరారు. అట్టిభూమిలో గ్రామానికి చెందిన క్రీడాకారులు క్రికెట్ ఆడుతున్నారని.. గ్రామంలో ఆటస్థలం లేనందున క్రీడామైదానంతోపాటు అవసరాలకు వినియోగించుకునేలా చూడాలన్నారు.

7 నుంచి విగ్రహ పున:ప్రతిష్ఠ ఉత్సవాలు

భూత్పూర్: మండలంలోని కప్పెటలో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ పున:ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి. మధుసుదన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఆదివారం ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కాగా ఎస్‌డీఏ ఫ్‌నిధుల నుంచి రూ.2లక్షలు, రూ.25వేల విరాళాన్ని గ్రామ పెద్దలకు అందజేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, చల్లా వంశీచందర్‌రెడ్డి తదితరులను సైతం కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

చాంపియన్‌షిప్‌కు విద్యార్థులు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 11న డ్రాగన్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ ఆర్గనైజర్ భీమా ఉదయ్ ఆధ్వర్యంలో జరిగే ఇంటర్నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో.. కింగ్‌షోటోకాన్ కరాటే విద్యార్థులు పాల్గొంటున్నట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో విద్యార్థులను జహంగీర్‌పాష ఖాద్రీ అభినందించారు. టోర్నీలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారం అవుతాయని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత 9 సంవత్సరాలుగా ఉన్న సమస్యలను పోరాటాలు చేయడం ద్వారా ప్రభుత్వం స్పందించి పరిష్కరించిందన్నారు. కిష్టయ్య, నర్సిములు, భాస్కర్, శ్రీనివాసులు, మన్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈఓ జయశ్రీని అవమానించిన రూరల్ ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌పై వెంటనే జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి వివాదాలు, అవినీతి లేకుండా ఎంఈఓ జయశ్రీ విధులు నిర్వహిస్తున్నారని, అటువంటి ఆమెను అవమాన పర్చారన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా మహిళా అధికారులు స్పందించకపోవడం దారుణమని అన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భరత్, సంతోష్‌రాథోడ్, నాయకులు శోభన్ బాబు, శ్రీను, మొగిలి, శ్రావణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధమైన కార్మికులు



జనరల్‌బాడీ సమావేశంలో పాల్గొన్న కార్మికులు

జడ్చర్ల టౌన్: అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం జడ్చర్ల మున్సిపల్ కార్మికులు దశలవారి పోరాటానికి సన్నద్ధమయ్యారు. పట్టణంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. సోమవారం నుంచి ఈ నెల 14వరకు ఆందోళనలు చేయనున్నారు. అప్పటికీ అధికారులు, పాలకులు స్పందించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్లాలని తీర్మానించారు.

ఇవీ సమస్యలు..

- శానిటేషన్ కార్మికులను కాంట్రాక్ట్ విధానంలో కొనసాగించాలని ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెం.1037ను వెంటనే ఉపసంహరించాలి.
- కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి.
- స్థానిక మున్సిపల్‌లో ఒకేపూట పని విధానాన్ని అమలు చేయాలి.
- కార్మికులకు ఫొటో విధానం రద్దుచేసి ప్రత్యక్ష హాజరు విధానం అమలు చేయాలి.
- జీఓ నెం 60, 63 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు అమలు చేయాలి.
- డిప్యుటేషన్‌పై ఉన్న శానిటరి ఇన్‌స్పెక్టర్‌ను వెంటనే బదిలీచేయాలి.
- ప్రధానంగా 2012 నుంచి 2014 వరకు ఈపీఎఫ్ కోసం కార్మికుల వేతనాల నుంచి డబ్బులు కట్‌చేశారు. అట్టి డబ్బులు కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో జమచేయకపోవటం వల్ల తీరని అన్యాయం జరుగుతోంది. ఇప్పటి వరకు 22 మంది కార్మికులు చనిపోగా వారికి పీఎఫ్ నుంచి రావాల్సిన లబ్ధి చేకూరలేదు. పలుమార్లు ఈ విషయంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకపోవటంతో ఆందోళనలు తప్పనిసరిగా నిర్ణయించారు.

ఆందోళన కార్యక్రమాలు ఇలా..

- 5, 6 తేదీల్లో విధుల్లో ఉంటూనే నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన
- 7, 8 తేదీల్లో డిమాండ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు
- 9, 10 తేదీల్లో అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించడం
- 11న మానవహారం
- 12, 13 తేదీల్లో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాలు
- 14న రిలే నిరాహారదీక్ష, వీటితో అధికారులు, పాలకవర్గం దిగి రాకపోతే నిరవధిక సమ్మె

11 ఏళ్లుగా ఎదురు చూపులు



ఫొటోలో కనిపిస్తున్న మహిళ ఎస్. అలివేలు. దివ్యాంగురాలు. కులాంతర వివాహం చేసుకుంది. అప్పటికే మున్సిపల్‌లో పనిచేస్తుండటంతో జీవితం సాఫీగా సాగింది. దంపతులకు ఓ కుమార్తె ఉంది. కాగా ఆర్‌కేగార్డెన్ సమీపంలో మార్చి 4, 2013న విధుల్లో ఉండగా కరెంట్ షాక్‌తో భర్త చనిపోయాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈపీఎఫ్ నుంచి ఎలాంటి లబ్ధి చేకూరలేదు. ప్రస్తుతం బాధితురాలు మున్సిపల్ పార్కులో పనిచేస్తుండగా బిడ్డ డిగ్రీ చదువుతోంది. 11 ఏళ్లుగా లబ్ధికోసం ఎదురుచూస్తోంది.

ఇబ్బందిగా ఉంది

నాభర్త కృష్ణ మున్సిపల్‌లో వాటర్‌మెన్‌గా పనిచేస్తుండేవాడు. మొత్తం నలుగురు ఆడపిల్లలున్నారు. ఫిబ్రవరి 23, 2022న గుమ్మకొండవద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పీఎఫ్ నుంచి ఏదైనా లబ్ధి కలుగుతుందని అనుకున్నా. ఇప్పటి వరకు ఎలాంటి లాభం కలగలేదు. ఆఫీసోళ్లు అప్పుడూ, ఇప్పుడూ అంటూ దాటేస్తున్నారు.

–చంద్రకళ, పీఎఫ్ బాధితురాలు, జడ్చర్ల మున్సిపాలిటీ

ఆందోళనలు అందుకే..

స్థానికంగా పరిష్కరించే సమస్యలను అధికారులు, పాలకవర్గం పట్టించుకోనందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళనబాట పట్టాల్సి వస్తోంది. 2012 నుంచి 2014 వరకు కార్మికుల జీతాల్లో పీఎఫ్ డబ్బులు కట్ అయిన వ్యక్తిగత ఖాతాలో జమ కాకపోవటం వల్ల.. 22 మంది కార్మికులు చనిపోయినా వారి కుటుంబాలకు లబ్ధి చేకూరలేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

–వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్

జోరుగా గుంతలు పూడ్చే పనులు



దేవరకద్ర: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం జోరుగా గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. కోయిల్‌సాగర్ రోడ్డు మలుపులో గుంతలు ఏర్పడి అధ్వాన్నంగా మారగా అక్కడ మట్టి కంకర వేశారు. అలాగే రాయిచూర్ రోడ్డు పక్కలో గుంతలు ఏర్పడి వాహనాలకు ఇబ్బంది కలగడంతో గుంతలను పూడ్చివేశారు. అలాగే పట్టణంలోని పలు రోడ్లపై వర్షం వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చి వేసే పనులు చేపట్టినట్లు ఈవో సీత్యానాయక్ తెలిపారు.

తుంకినీపూర్‌లో పైపులైన్ లీకేజీ



అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. గ్రామంలోని ఇళ్లకు నీటిని సరఫరా చేసే పైప్ లైన్‌కు ప్రధాన రోడ్డు వద్దనే లీకేజీ కావడంతో తాగునీరు రోడ్డంతా పారుతోంది. దీనివల్ల ప్రధాన రోడ్డు బురదమయంగా మారుతోంది. మూడు, నాలుగు రోజులుగా తాగునీరు లీకవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రధాన రోడ్డుపై నడిచి వెళ్లడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజును వివరణ కోరగా తాగునీటి లీకేజీపై తమకు సమాచారం లేదన్నారు. తాగునీరు వృథా కాకుండా పంచాయతీ కార్యదర్శికి చెప్పి బాగు చేయిస్తానని తెలిపారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మహమ్మదాబాద్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని మహమ్మదాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ పేర్కొన్నారు. ఆదివారం చౌదర్‌పల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. బీసీ సెల్ మండలాధ్యక్షుడు ముకుందం, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక తొమ్మిదో వార్డు పరిధిలోని మరుల్లో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. కాగా, ఈ కాలనీ మీదుగా మురుగు, వరద నీరు సాఫీగా ముందుకు వెళ్లేందుకు ఈ పనులు చేపడుతున్నారు. అంతకుముందు అశోక్‌టాకీస్ చౌరస్తా సమీపంలో అయ్యప్పస్వామి ఆలయ అన్నదాన మండపాన్ని ప్రారంభించారు. అనంతరం అయ్యప్పస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు మూషా నరేందర్, రామ లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు సీమ నరేందర్, పీఈటీ రమేశ్, వనగంటి శంకర్, పీట్ల యాదయ్య, సతీష్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక 4వ వార్డు పరిధిలోని ఎదిరలో, 11వ వార్డులోని పాతపాలమూరులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, నర్సింహ, చెన్నయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

ఆలయాల్లో అమావాస్య పూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అమావాస్యను పురస్కరించుకుని స్థానిక కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని సరస్వతీదేవి ఆలయంలో ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారి విగ్రహాన్ని పల్లకీలో ఉంచి కొద్దిసేపు గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ధర్మకర్త నాగరాజు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

గండీడ్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆలయాలు కిటకిటలాడాయి. ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. అంతర్‌గంగ లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. వివిధ గ్రామాల ఆలయాన్ని దర్శించుకున్నారు. వరహగిరి గట్టు చెన్నరాయుడి జాతర ఉత్సవాలు శ్రావణ మాసంలో కొనసాగనున్న నేపథ్యంలో యజ్ఞం చేపట్టారు.

జడ్చర్ల టౌన్: అమావాస్య పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలోని గోశాలలో భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. కార్యక్రమానికి వక్త ప్రాణేష్ హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

చండీహోమం

అమావాస్య పురస్కరించుకుని మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలోని శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో లోకకల్యాణార్థం చండీహోమం నిర్వహించారు. ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో హోమం జరిపించి అన్నదానం చేశారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే



నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ చెంత జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బోనం ఎత్తారు. ఆదివారం అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పార్టీ మండల నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బోనంతో ప్రదక్షిణలు చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా ప్రత్యేకంగా కృషి చేస్తానని వివరించారు. రాంచంద్రయ్య, నర్సింహచారి, జహీర్ అక్తర్, వెంకటేష్ గౌడ్, భూపాల్ రెడ్డి, డా.మీనాక్షి, అంజనేయులు, కుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తోటమైసమ్మకు పూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం కుర్హినిశెట్టికాలనీలో గల శ్రీతోట మైసమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసోత్సవంలో భాగంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

అటెన్షన్ ప్లీజ్



రాకపోకలకు తప్పని పాట్లు

మండల కేంద్రంలో జాతీయ రహదారిని ఆనుకొని సర్వీసు రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ వద్ద పార్కింగ్ స్థలం సరిపడా లేదు. దీంతో బ్యాంకుకు వచ్చే వారు తమ వాహనాలు నిలిపేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతో చేసేది లేక వారు సర్వీసు రోడ్డుకు ఇరువైపులా దారిపైనే వాహనాలు నిలుపుతున్నారు. అంతేకాకుండా జాతీయరహదారిపై సైతం బ్యాంకు వైపు వాహనాలు ఆపుతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు కలుగుతున్నాయి. మండల కార్యాలయాలకు ఇదే రోడ్డుగుండా వెళ్లాల్సి ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల రుణమాఫీ నేపథ్యంలో వివిధ గ్రామాల రైతులు భారీగా వస్తుండడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. వాహనాలు బారులు తీరుతున్నాయి. దీనికితోడు బస్టాప్ కూడా ఇక్కడే ఉండడంతో విద్యార్థులు, ప్రజలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

- గండేడ్

సంప్రదించవలసిన అధికారి: శేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ, మహమ్మదాబాద్, సెల్: 87126 59342

మంత్రికి వినతుల వెల్లువ



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

దేవరకద్ర/చిన్నచింతకుంట : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావుకు గ్రామ పంచాయతీ కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. దేవరకద్ర మీదుగా కోయిల్ సాగర్ వెలుతున్న మంత్రికి వారు వినతి పత్రం ఇచ్చి తమ గోడు చెప్పుకున్నారు. వెంకటన్న, బాల్‌రాజు, కిష్టన్న తదితరులు ఉన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చిన్నచింతకుంట మండలపరిధిలో సోమవారం కురుమూర్తి స్వామి ఆలయం వద్ద తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, జేఎస్ దేవదానం, కార్యదర్శి సాంబశివుడు, జిల్లా కోశాధికారి గణేష్, పంచాయితీ కార్మికులు కుర్మన్న, శ్రీను, రవి పాల్గొన్నారు.

నిధులివ్వాలని..

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఆదివారం కురుమూర్తిస్వామి దేవాలయం వద్ద గ్రామస్తులు మంత్రిని కలిసి నిధుల కోసం వినతిపత్రం అందజేశారు. దక్షిణకాశీగా పేరుగాంచిన కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కాశీలో మాత్రమే ఉండే కల్పవృక్షాలు ఉన్నాయని తెలిపార. ప్రసిద్ధికెక్కిన ఆలయం వద్ద భక్తులు బస చేయడానికి సరైన వసతి లేదని మంత్రికి వివరించారు. కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

నేటి కార్యక్రమాలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జడ్చర్ల: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రూ.68 లక్షలతో చేపట్టనున్న బండమీదిపల్లి నుంచి శంకరాయపల్లి తండా బీటీ రోడ్డు పనులకు, రూ.1.74 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మాటుబండ తండా బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

రాజాపూర్: మండలంలోని కల్లేపల్లి గ్రామం నుంచి గోరిగడ్డతండా వరకు నిర్మించనున్న బీటీరోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మశ్చందర్ ఆదివారం వివరాలు తెలియజేశారు. అదేవిధంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. బోడ జానంపేట్ నుంచి నామ్యాతండా వరకు చేపట్టబోయో బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

అఖండ దీపారాధన

దేవరకద్ర: మండల కేంద్రంలోని శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాల్లల్లో శ్రావణ మాసం పురస్కరించుకుని సోమవారం నుంచి అఖండ దీపారాధన కార్యక్రమం ప్రారంభం అవుతుందని కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రావణమాసంతో పాటు మరో 11 రోజులు కలుపుకొని 41 రోజుల పాటు కార్యక్రమం ఉంటుందన్నారు. నిత్యం భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఎమ్మెల్యే రాక..

దేవరకద్ర: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం ప్రారంభించడానికి దేవరకద్రకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం వస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు దేవరకద్రలోని మార్కెట్ యార్డు నుంచి బాలుర ఉన్నత పాఠశాల వరకు జరిగే ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణం

గండీడ్: వెన్నాచేడ్‌లో సోమవారం నుంచి హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభం కానుంది. ఏటా శ్రావణ మాసంలో వెన్నాని ఆంజనేయస్వామి ఆలయం వద్ద కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఉదయం 4.30 గంటలకు అభిషేకంతో ప్రారంభించి రోజూ 11 సార్లు పారాయణం చేస్తారు. చివరి రోజు 108 సార్లతో ముగింపు చేస్తారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు హర్షణీయం



మహబూబ్‌నగర్ రూరల్: మాదిగల మూడు దశాబ్దాల పోరాటం ఫలించిందని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజు అన్నారు. టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హలో మాదిగ.. ఛలో ఢిల్లీకి జిల్లా కేంద్రం నుంచి ఆదివారం నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం ధర్నాలు, రాస్తారోకోలు, పోలీస్‌స్టేషన్‌లలో కేసులు, కోర్టుల చుట్టూ తిరిగి ఎంతో కష్టపడి ప్రతి సంవత్సరం ఢిల్లీలో జంతర్‌మంతర్ ఆందోళనలు చేపట్టినట్లు వివరించారు. సుప్రీంకోర్టు తీర్పును అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 200 మంది కార్యకర్తలతో కృతజ్ఞత వియోజత్సవ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. 6, 7వ తేదీలలో ఢిల్లీలో విజయోత్సవ సభ ఉంటుందని పేర్కొన్నారు. ఢిల్లీకి బయలుదేరిన వారిలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్సిములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, నాయకులు గోటూరు బాలరాజు, రాజేష్, శ్రీనివాస్, కుమార్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఆరో వార్డు పరిధిలోని శ్రీనివాసకాలనీ ఊరగుట్ట (చెరువు రోడ్) కు వెళ్లే మార్గంలో ఓ విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూమి బాగా తడిసిపోయి ఇది ఒకవైపు పడిపోయే పరిస్థితి నెలకొంది. ఈ స్తంభంపై సుమారు 20 ఇళ్లకు కనెక్షన్లు ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి దీని అడుగు భాగాన్ని సిమెంట్ కాంక్రీట్‌తో బాగు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో రెండో పట్టణ ఏఈ భగవంతును వివరణ కోరగా త్వరలోనే అక్కడికి వెళ్లి పరిశీలించి స్తంభం ఒరిగిపోకుండా మరమ్మతు చేయిస్తామన్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



జిల్లాకేంద్రం పిల్లలమర్రిలో..



మిడ్జిల్‌లో..



మయూరీ పార్క్‌లో ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఉల్లాసంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని మయూరీ ఏకో అర్బన్ పార్క్‌లో ఫ్రెండ్‌షిప్‌డే సందర్భంగా సందడి నెలకొంది. స్నేహితులు కలుసుకొని తమ జ్ఞాపకాలు, తీపి గుర్తులను నెమరవేసుకున్నారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టి స్నేహాన్ని చాటుకున్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రంలోని బీపీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన (1997–98 బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. దాదాపు 26 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు నాటి రోజులను గుర్తు చేసుకున్నారు.

మిడ్జిల్: స్నేహితుల దినోత్సవంను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రాజేందర్ రెడ్డి, శ్రీను, బాలు, బాలస్వామి, రవి, శంకర్,మల్లయ్య, శ్రీనువాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం - పచ్చదనం' ఏర్పాట్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని ఈనెల 5న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అక్కడి ప్రాంతాన్ని మొత్తం చదును చేస్తున్నారు. ఈ పనులను స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు.

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి శుక్రవారం వరకు స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వార్డు ఆఫీసర్లు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు, ర్యాలీ ఉంటుందని వివరించారు.